# చారిత్రాత్మక కట్టడాలను కాపాడాలి

- కలెక్టర్‌కు గద్వాల రాజవంశీయుల వినతి

కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న రాజవంశీయులు, నాయకులు

గద్వాల టౌన్, ఏప్రిల్ 2 : గద్వాల సంస్థానాధీశుల కాలంలో ఎన్నో చారిత్రాత్మక కట్టడాలు, బావులు నిర్మించారని ప్రస్తుతం అవన్నీ కబ్జాకు గురవుతున్నాయని రాజవంశీయులు సుహాసినిరెడ్డి, విక్రమసింహారెడ్డి వెంకట్రామ జగద్దేవ్, వెంకట్రాధి జగద్దేవ్‌ల తోపాటు ప్రజా సంఘాల నాయకులు, పురవస్తు కట్టడాల పరిరక్షణ సమితి, సీనియర్ సిటిజన్ ఫోరం, బీఆర్ఎస్ నాయకులు కోరారు. జిల్లా కేంద్రంలోని కృష్ణా రెడ్డిబంగ్లాలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సంస్థానాధీశుల కాలంలో ఎన్నో అపురూప కట్టడాలు నిర్మితమయ్యాయని చెప్పారు. కట్టడాల కారణంగా గద్వాలకు ఎంతో పేరు వచ్చిందన్న విషయాన్ని అందరు గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అందులో ఒకటి ఈ మధ్యనే కబ్జాకు గురైన జానకమ్మ మెట్ల బావి(కొత్తబావి)ఒకటన్నారు. నాటి కట్టడాలను కాపాడి భావితరాలకు చరిత్రను అందించాల్సిన వారే వాటిని నాశనం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. చరిత్రను కాలరాసేందుకు ప్రయత్నిస్తున్న వారు చరిత్రహీనులుగా మిగిలిపోక తప్పదన్నారు. గద్వాల ప్రతిష్టను, ప్రత్యేకతను ఇనుమడింపచేసే విధంగా ఉన్న కట్టడాలను కాపాడి ఆ ప్రతిష్టను కాపాడాలన్నారు. అనంతరం కబ్జాకు గురైన బావిని పరిశీలించారు. అలాగే కలెక్టర్ సంతోష్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కలెక్టర్ స్పందిస్తూ చొక్కంబావి, లింగం బావి తరహాలోనే మిగతా బావులను తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కురుపపల్లయ్య, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

## యువవికాస పథకానికి దరఖాస్తులు చేసుకోవాలి

వనపర్తి టౌన్, ఏప్రిల్ 2 : జిల్లాలోని అర్హులైన వారు రాజీవ్ యువవికాస పథకానికి నేరుగా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని అదనపు కలెక్టర్ యాదయ్య ఆదేశించారు. బుధవారం తనచాంబర్‌లో జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పార్శీ, జైన, బౌద్ధులకు చెందిన యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా ఆర్థికపురోగతిని పెంపొందించాలనే లక్ష్యంతో పథకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. ఏప్రిల్ 14 వరకు గడువు పొడగించడం జరిగిందన్నారు. అర్హులైన వారు నేరుగా ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాలకు వచ్చి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అందుకు అధికారులు కౌంటర్లు ఏర్పాటు చేసి ఫారమ్‌లను అందుబాటులో ఉంచారన్నారు. సమావేశంలో డీఆర్‌డీవో ఉమాదేవి, జిల్లా ఉద్యానశాఖ అధికారి అఫ్జల్, మైనార్టీ సంక్షేమ అధికారి అఫ్జలుద్దీన్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, జిల్లా సంక్షేమాధికారిని సుధారాణి తదితరులు ఉన్నారు.

### గడువు పొడిగింపు

గోపాల్‌పేట, ఏప్రిల్ 2 : రాజీవ్ యువవికాసం పథకం దరఖాస్తు గడువు ఈ నెల 14 వ తేదీ వరకు పొడిగించినట్లు ఎంపీడీవో శంకర్‌నాయక్ బుధవారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారుడు అనుభవం ఉన్న యూనిట్ ఎంపిక చేసుకోవాలని ఆయన సూచించారు.

## చేనేత కార్మికుల నిరసన

రాజోళిలో చేనేత కార్మికుల నిరసనలు

రాజోళి, ఏప్రిల్ 2 : రాజోళి మండల కేంద్రంలో చేనేత కార్మికులు ప్రభుత్వ పథకాలు అమలు చేయాలంటూ బుధవారం కార్మికులు నిరసనలు తెలిపారు. చేనేత వృత్తిపై ఆధారపడిన కుటుంబాలకు ప్రభుత్వం హామీ ఇచ్చిన పథకాలను అమలు చేస్తూ గత ప్రభుత్వం అందించిన చేనేత క్లస్టర్ పథకం ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలు వృత్తి చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మదనాపురం, ఏప్రిల్ 2 : మండలంలోని అజ్జకొల్లు గ్రామంలో బుధవారం అదనపుకలెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అంతకు ముందు తిర్మలాయపల్లి లో రేషన్ షాపులో లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇచ్చిన వాగ్దానాలను ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటు వస్తున్నామన్నారు. అదనపుకలెక్టర్ మాట్లాడుతూ.. గన్నీ బ్యాగులు, తేమ కొలిచే యంత్రాలు, వేయింగ్ మిషన్లు సరిపడా అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు.

### నేడు ఒకేషనల్ పరీక్ష

మల్దకల్, ఏప్రిల్ 2 : నేడు జెట్పీ ఉన్నత పాఠశాలలో ఒకేషనల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎంఈవో సురేశ్ తెలిపారు. బిజ్వారం, మల్దకల్ నుంచి మొత్తం 165 మంది విద్యార్థులు ఉన్నత పాఠశాలలోనే రాయాల్సి ఉందని తెలిపారు.

### కొత్త నిబంధనలతో కష్టాలు

పీపనగండ్ల, ఏప్రిల్ 2 : ఉపాధిహామీ పథకంలో కొత్త నిబంధనలతో కూలీలకు పని అవకాశం కోల్పోతూ కష్టాల పాలవుతున్నారని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు ఆరోపించారు.

### ఆయాల పోస్టులను భర్తీ చేయాలి

కొత్త కోట, ఏప్రిల్ 2 : కొత్తకోట, మదనాపురం మండలాల్లో ఖాళీగా ఉన్న ఆయాల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్ వినతిపత్రాన్ని ఇచ్చారు. ఎమ్మెల్యే సన్నబియ్యాన్ని పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి డాక్టర్ వచ్చిన ఆయనకు విజ్ఞప్తి చేశారు.

### మహాసభను విజయవంతం చేయాలి

రేవల్లి, ఏప్రిల్ 2 : ఏప్రిల్ 5న జరిగే తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 2వ మహాసభను విజయవంతం చేయాలని మండలాధ్యక్షుడు రామచంద్రయ్య అన్నారు. అనంతరం పంచాయతీ వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు.

# సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు
- సన్నబియ్యం పంపిణీ ప్రారంభం



అలంపూర్‌లో బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్, ఏప్రిల్ 2 : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. బుధవారం అలంపూర్ మున్సిపల్ పరిధిలోని ఇమాంపురం రేషన్ దుకాణంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో అలంపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ శేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఇల్లూరి వెంకట్రామయ్యశెట్టి, తాసీల్దార్ మంజుల, డీలర్లు గోవిందు, మద్దిలేటి, నర్సింహ, వరలక్ష్మి, నాగరాజు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

### మానవపాడు, ఉండవెల్లిలో..

మానవపాడు/ ఉండవెల్లి, ఏప్రిల్ 2 : ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే విజయుడు సూచించారు. బుధవారం మండలంలోని మద్దూరులో ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్నబియ్యం పంపిణీ పథకాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో తాసీల్దార్ జోషి శ్రీనివాసశర్మ, ఆర్ఐ గురురాజ, డీలర్ రంగన్న తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఉండవెల్లి మండలంలోని తక్కశిలలోనూ ఎమ్మెల్యే సన్నబియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో తిరుపతన్న, తాసీల్దార్ ప్రభాకర్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

### పేదవాడి ఆకలి తీర్చడమే లక్ష్యం :కలెక్టర్

గద్వాల, ఏప్రిల్ 2 : పేదవాడి ఆకలి తీర్చడమే ప్రభుత్వ లక్ష్యమని అందు కోసం అర్హులైనా ప్రతి పేదవాడికి ప్రభుత్వం సన్నబియ్యం అందిస్తుందని కలెక్టర్ సంతోష్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని 35, 26 వార్డుల్లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డితో కలిసి కలెక్టర్ ప్రారంభించి లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, తాసీల్దార్ మల్లికార్జున, డీఎస్‌వో స్వామికుమార్ రేషన్‌డీలర్లు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ధరూరులో సన్నబియ్యం పంపిణీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్



ఖిల్లాఘణపురంలో పంపిణీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్

### సన్నబియ్యం పక్కదారి పట్టించొద్దు : ఎమ్మెల్యే

ధరూరు, ఏప్రిల్ 2 : సన్నబియ్యాన్ని దళారులకు విక్రయించొద్దని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పంచాయతీ కార్యాలయ ఆవరణలో రేషన్‌బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ సంతోష్, ప్రజాప్రతినిధులతో కలిసి సన్నబియ్యం పంపిణీ చేశారు.కార్యక్రమంలో మాజీ వైస్‌ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ విజయ్‌కుమార్, అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, తాసీల్దార్ భూపాల్‌రెడ్డి, డీసీఎస్‌వో స్వామికుమార్, ఎంపీడీవో మంజుల పాల్గొన్నారు.

### సన్నబియ్యం ఇవ్వడం చారిత్రాత్మకం: ఎమ్మెల్యే

ఖిల్లా ఘణపురం, ఏప్రిల్ 2 : ప్రతి కుటుంబానికి సన్నరకం బియ్యాన్ని ఇవ్వడం చారిత్రాత్మకమని ఎమ్మెల్యే మేఘా రెడ్డి అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని 3వ నంబర్‌లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీవో సుబ్రమణ్యం, తాసీల్దార్ పాల్గొన్నారు.

### పెద్దమందడిలో..

పెద్దమందడి, ఏప్రిల్ 2 : మండలకేంద్రంలోని రేషన్ షాపు దుకాణంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మేఘా రెడ్డి ప్రారంభించారు. త్వరలోనే వనపర్తి నుంచి పెద్దమందడికి వచ్చే రహదారి డబుల్ లైన్ బీటీ రోడ్డుగా మారుతుందన్నారు.

### గోపాల్‌పేటలో..

గోపాల్‌పేట, ఏప్రిల్ 2 : రేషన్‌కార్డు దారులకు సన్నబియ్యం పంపిణీ పథకం కార్యక్రమాన్ని బుధవారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే మేఘా రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీవో సుబ్రమణ్యం, తాసీల్దార్ తిలక్‌కుమార్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## చేతివాటం చేసిన ఉద్యోగిపై విచారణ

గద్వాల అర్బన్, ఏప్రిల్ 2 : జమ్ములమ్మ ఆలయంలో శుక్రవారం హుండీ లెక్కింపు సమయంలో ఆలయానికి సంబంధించిన కాంట్రాక్ట్ ఉద్యోగి చేతివాటం ప్రదర్శించినట్లు ఆరోపణలు రావడంతో బుధవారం 'నమస్తే తెలంగాణ' పత్రికలో కథనం వెల్లువడింది. ఈ క్రమంలో దేవాదాయ శాఖ ఉన్న తాధికారులు తక్షణమే స్పందించి గురువారం జమ్ములమ్మ ఆలయం సందర్శించి హుండీ లెక్కింపు సమయంలో కాజేసిన నగదుపై విచారణ జరిపేందుకు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. ఈ విషయంపై ఈవో పురేందర్‌ను వివరణ కోరగా.. జరిగిన విషయం వాస్తవమే. ఉన్నతాధికారులు ఈ విషయంపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటారు.

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

గద్వాల రూరల్, ఏప్రిల్ 2 : ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన బుధవారం మండలంలోని చోటు చేసుకున్నది. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ప్రకారం.. గద్వాల పట్టణ పరిధిలోని వెంకటోనిపల్లి గ్రామానికి చెందిన నవీన్(30) మండలంలోని వీరాపురం సమీపంలోని ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాలలో సెంట్రింగ్ పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు ఐరన్ పైపులకు సంబంధించిన అట్టడిని సరిచేసుకునే క్రమంలో అది పక్కనే ఉన్న విద్యుత్‌వైర్లపై పడడంతో విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే మృతదేహాన్ని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి భార్య జయశ్రీ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

# పాపన్నగౌడ్ పోరాటాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

- గద్వాల కలెక్టర్ సంతోష్



పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్

గద్వాల, ఏప్రిల్ 2 : సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పోరాట పటిమను ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ సంతోష్ కోరారు. బుధవారం బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో పాపన్న గౌడ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైనా కలెక్టర్ ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. బహుజన రాజ్యాన్ని స్థాపించిన మొట్ట మొదటి యోధుడన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, అధికారులు రమేశ్‌బాబు, సరోజ, అచ్చన్న గౌడ్ పాల్గొన్నారు.

### సర్వాయిపాపన్న సేవలను మరువలేము

వడ్డేపల్లి, ఏప్రిల్ 2 : సర్వాయిపాపన్న గౌడ్ సేవలను మరువలేమని గౌడ సంఘం అధ్యక్షుడు రాధాకృష్ణ గౌడ్ అన్నారు. శాంతినగర్‌లో బుధవారం సంఘం ఆధ్వర్యంలో పాపన్న వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వీరేశ్‌గౌడ్, వెంకటేశ్ గౌడ్ పాల్గొన్నారు.

### ఖిల్లాఘనపురంలో..

ఖిల్లా ఘణపురం, ఏప్రిల్ 2 : దక్కన్‌గడ్డపై మొదటిసారి బహుజన రాజ్యాన్ని స్థాపించిన తొలి పోరాటయోధుడు సర్వాయి పాపన్నగౌడ్ అని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. బుధవారం మండలకేంద్రంలో పాపన్నగౌడ్ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు మురళీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పెబ్బేరులో..

పెబ్బేరు, ఏప్రిల్ 2 : తొలి తెలుగుబహుజన చక్రవర్తి పాపన్న గౌడ్ వర్ధంతిని బుధవారం పెబ్బేరులో నిర్వహించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో సుభాష్‌చౌరస్తా వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీనివాసగౌడ్, రామన్‌గౌడ్ పాల్గొన్నారు.

### కొత్తకోటలో..

కొత్త కోట, ఏప్రిల్ 2 : పట్టణ చౌరస్తాలో పాపన్న గౌడ్ వర్ధంతిని గౌడసంఘం నాయకులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి బీఆర్ఎస్ మాజీ జిల్లా వైస్‌చైర్మన్ వామన్‌గౌడ్ మాట్లాడారు. కార్యక్రమంలో ఉమ్మడిజల్లా సీడీసీ చైర్మన్ చెన్నకేశవ రెడ్డి, గౌడసంఘం అధ్యక్షుడు వెంకట్న పాల్గొన్నారు.

### వనపర్తిలో..

వనపర్తి టౌన్, ఏప్రిల్ 2 : సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మేఘా రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్‌చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, మాజీ ప్రజాప్రతినిధులు కృష్ణ, సతీష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గౌడసంఘం నాయకులు

# ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు..

పరీక్షహాల్ నుంచి కేరింతలు కొడుతూ బయటికి వస్తున్న విద్యార్థులు

వనపర్తి టౌన్, ఏప్రిల్ 2 : జిల్లావ్యాప్తంగా కొనసాగిన పదోతరగతి పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ముగిసాయి. మార్చి 21నుంచి ఏప్రిల్ 2వరకు రోజువారీ పరీక్షలు కొనసాగగా ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. బుధవారం చివరి పరీక్షకు జిల్లావ్యాప్తంగా 36 కేంద్రాలకు గాను 99.81 శాతం విద్యార్థులు హాజరు కాగా 6,853 మందికి, ప్రైవేట్ 5మందికి గాను 13మంది గైర్హాజరైనట్లు పరీక్ష విభాగాధికారి గణేశ్‌కుమార్ తెలిపారు.

### ఖిల్లాఘణపురంలో..

ఖిల్లా ఘణపురం, ఏప్రిల్ 2 : పదోతరగతి వార్షిక పరీక్షలు బుధవారంతో ప్రశాంతంగా ముగిశాయి. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 230 విద్యార్థులకు 228 మంది విద్యార్థులు హాజరవ్వగా ఇద్దరు గైర్హాజరయ్యారు. అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో 213 మందికి 213 విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 443మందికి 441 హాజరై ఇద్దరు గైర్హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంఈవో జయశంకర్ తదితరులు ఉన్నారు.

### పెద్దమందడిలో..

పెద్దమందడి, ఏప్రిల్ 2 : పదోతరగతి పరీక్షలు ముగిసినట్లు ఎంఈవో విష్ణు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని రెండు పరీక్షా కేంద్రాలు జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలో జరిగిన చివరిపరీక్షలో 364మంది విద్యార్థులకు 363 మంది విద్యార్థులు హాజరై ఒక్కరు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు.

పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న డీఈవో

## ఇండ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి

గద్వాల రూరల్, ఏప్రిల్ 2 : మండలంలోని కుర్వపల్లి (నల్లదేవులనిపల్లి)లో బుధవారం అదనపు కలెక్టర్ నర్సింగరావు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను, పురోగతిపై ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్మాణ పనుల స్థితి, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ వేగవంతంగా పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారిణికి అభినందన

అనూషను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి టౌన్, ఏప్రిల్ 2 : జాతీయ స్థాయి కబడ్డీ క్రీడాపోటీలకు ఎంపికైన ఇస్లావత్ అనూషను ఎమ్మెల్యే మేఘారెడ్డి బుధవారం శాలువాతో సత్కరించారు. ఇటీవల బీహార్‌లో జరిగిన జాతీయ స్థాయి కబడ్డీ క్రీడా పోటీలకు పెద్దమందడి మండలం పిల్లిగుట్టతండాకు చెందిన అనూష ఎంపికైందని , క్రీడలపై ఉన్న మక్కువతో జాతీయస్థాయికి ఎంపిక కావడం అభినందనీయమని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్‌చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, ఉన్నారు.

## పోలీస్‌స్టేషన్‌కు స్థల పరిశీలన చేసిన ఎస్పీ

స్థలం పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

ధరూరు, ఏప్రిల్ 2 : నూతన పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి ఎంపిక చేసిన స్థలాన్ని ఎస్పీ శ్రీనివాసరావు పరిశీలించారు. బుధవారం ఆయన డీఎస్పీ మొగిలయ్యతో కలిసి పాతచర్ల దగ్గర, తాసీల్దార్ కార్యాలయం, జాంపల్లి వద్ద వున్న ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండశ్రీహరి, కార్యదర్శి పాల్గొన్నారు.

## అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం

వనపర్తి టౌన్, ఏప్రిల్ 2 : మండలంలోని చిట్యాల ఉన్నత పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిద్ధు, రవి, సంజీవయ్య ఉన్నారు.

## నిబంధనలు పాటించాలి

ఇటిక్యాల, ఏప్రిల్ 2 : రసాయనిక ఎరువులు, పురుగు మందులను రైతులకు విక్రయించే వారు ప్రభుత్వ నిబంధనలు పాటించకుంటే కఠినచర్యలు ఉంటాయని మండల వ్యవసాయ అధికారి రవికుమార్ హెచ్చరించారు. సాతర్ల, ఉదండాపురం, ఇటిక్యాల స్టేజీలోని పురుగు మందులు, ఎరువులు విక్రయించే దుకాణాలను తనిఖీ చేశారు.

## పెండింగ్ బిల్లులు చెల్లించాలి

పాన్‌గల్, ఏప్రిల్ 2 : పెండింగ్‌లో ఉన్న గిరిజన కార్పొరేషన్ బిల్లులు వెంటనే చెల్లించాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బాల్యానాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలకేంద్రంలో ఎంపికైన లబ్ధిదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

## చైల్డ్‌వెల్ఫేర్‌కు బాలిక అప్పగింత

గద్వాల అర్బన్, ఏప్రిల్ 2 : రైల్లో 14ఏండ్ల బాలిక తప్పిపోయిన విషయని ఆర్‌పీఎఫ్ పోలీసులు గమనించి చేరదీసిన ఘటన బుధవారం చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ నుంచి కర్నూల్‌కు వెళ్లే రైల్లోబాలిక తప్పిపోయినట్లు పోలీసులు తెలిపింది. దీంతో బాలికను చేరదీసి గద్వాల రైల్వేస్టేషన్‌లో దింపి 1098 నెంబర్‌కు కాల్ చేసి జిల్లా సంక్షేమశాఖాధికారి అదేశాల మేరకు జిల్లాకేంద్రంలోని సఖి కేంద్రానికి తరలించారు. బాలికకు పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించగా.. పేరు లక్ష్మి ఊరు చేగుంట తిమ్మాజీపేట మండలానికి చెందినట్లు తెలిపారు. గురువారం గద్వాల నుంచి నాగర్‌కర్నూల్ జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి తరలించనున్నట్లు తెలిపారు.

## క్రీడలతో మానసికోల్లాసం

అయిజ, ఏప్రిల్ 2 : క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని బీఆర్ఎస్ సీనియర్ నేత, సింగిల్ విండో మాజీ చైర్మన్ సంకాపురం రాముడు అన్నారు. బుధవారం అయిజ పట్టణంలోని ఎస్సీకాలనీలో చౌదరి క్రికెట్ లీగ్ సీజన్ – 4 టోర్నీని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ దేవన్న, మాజీ సర్పంచ్ భద్రయ్య, మాజీ ఎంపీటీసీ చిన్న రాముడు, బీఆర్ఎస్ నాయకులు ఉండేకారి మల్లయ్య, క్రీడాకారులు పాల్గొన్నారు.

## గ్రూప్-1 విద్యార్థికి సన్మానం

పాన్‌గల్, ఏప్రిల్ 2 : మండలంలోని బుసిరెడ్డిపల్లికి చెందిన సుజాత గ్రూప్ 1 పరీక్షలో 459 మార్కులతో 405 ర్యాంకు సాధించారు. ప్రస్తుతం ముసాపేట్ ఎస్సైగా ఉన్నారు. సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి రాము ఆధ్వర్యంలో ఆశవర్కర్లు తదితరులు సన్మానించారు.

# విద్యార్థులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

- సీపీఎం నాయకుల డిమాండ్

ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

వడ్డేపల్లి, ఏప్రిల్ 2 : హెచ్‌సీయూ భూములను కాపాడాలని ఉద్యమిస్తున్న విద్యార్థులపై ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని సీపీఎం జిల్లా నాయకుడు వెంకటస్వామి డిమాండ్ చేశారు. బుధవారం శాంతినగర్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట హెచ్‌సీయూ విద్యార్థుల అక్రమ అరెస్టులను వ్యతిరేకిస్తూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పరం జ్యోతి, దేవదాసు, వేణు, శేఖర్, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

### భూముల వేలాన్ని నిలిపివేయాలి

గద్వాల టౌన్, ఏప్రిల్ 2 : హెచ్‌సీయూ భూముల వేలాన్ని ప్రభుత్వం వెంటనే నిలిపి వేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్‌స్వామి డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని, విద్యార్థుల అక్రమ అరెస్టులకు నిరసనగా బుధవారం జిల్లాకేంద్రంలోని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉప్పేరు నరసింహ, రంగన్న, నరేశ్, కల్యాణ్, రామకృష్ణ, వీరేశ్ పాల్గొన్నారు.

ధరూరులో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

### నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

ధరూరు, ఏప్రిల్ 2 : హెచ్‌సీయూ భూములను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని మండల సీపీఎం నాయకులు దేవదాసు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తాలో పార్టీ నాయకులు సీఎం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో నర్సింహులు, ప్రవీణ్, మోష, తిమ్మప్ప, రాముడు పాల్గొన్నారు.

### హెచ్‌సీయూపై సీఎం వైఖరి మారాలి

అమరచింత, ఏప్రిల్ 2 : రాష్ట్ర అభివృద్ధి కోసం అంటూ హెచ్‌సీయూ భూములను ప్రైవే